# తప్పుకదూ?

''తప్పుకదూ? బట్టలు కట్టుకుంటుంటే అలా రావచ్చా?'' రాణి కోసం వాళ్ళ ఇల్లంతా వెదకి, మూసివున్న ఆ గది తలుపుల్ని హఠాత్తుగా తెరచి, అర్ధనగ్నంగా వున్న రాణిని మతిపోయి చూస్తూ నిల్చున్న నేను ఆమె మందలింపుతో ఈ లోకంలోకి వచ్చాను.

సభ్యతకాదు వెనక్కి వెళ్ళిపోవాలనిపించినా కాళ్ళు కదలనని మొరాయించాయి.

లంగా మాత్రమే వేసుకుని జాకెట్టు వేసుకోబోతున్నదల్లా తలుపులు హఠాత్తుగా తెరచుకోవడంతో సిగ్గుతో గువ్వలా ముడుచుకుపోయింది. నా దృష్టి ఆమె నున్నటి భుజాల్ని దాటి ఇవతలికి రావడంలేదు. ఆమె భుజాల మీదనుంచి జారుతున్న నీటి బిందువుల్ని చూస్తూ అలాగే నిలబడి పోయాను.

''తప్పుకదూ...'' మరోసారి రాణి మందలింపుతో ఈ లోకంలోకి వచ్చి ''మీ అమ్మగారు మా ఇంట్లో వున్నారు. పిండి జల్లెడ నిన్నడిగి తెమ్మంటే...''

''నే వస్తున్నాలే పద...''

కదలనని మొరాయించిన కాళ్ళని బలవంతాన బయలుదేరతీశాను. నేను గడప దాటగానే భళ్ళున తలుపులేసేసింది రాణి.

రోజులు గడిచినకొద్దీ మరుగునపడడం మాటటుంచి ఈ సంఘటన మరింత అందంగా మనసులో రూపులు దిద్దుకోసాగింది.

ఆరోజు—

నా భావాలనయితే మొండిగా ధైర్యంచేసి అక్షరరూపంలోకి మార్చి ఆమె ముందు వుంచగలిగానుగాని, ఆమె ఎలాంటి భావాన్ని వ్యక్తపరుస్తుందోనని భయపడిపోసాగాను.

భయపడ్డంతా జరిగింది.

"తప్పు కదూ? ఇటువంటి ప్రేమలేఖల్ని ఆడపిల్లలకి రాయవచ్చా? చదువు మాని నువ్వు చేస్తున్న పని ఇదా? మళ్ళీ ఇటువంటి రాతల్ని రాసావంటే మీ నాన్నగారి ముందు నిలబెడతాను జాగ్రత్త!" నేనెంతో కష్టపడి రాసిన వుత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చేసి గట్టి వార్నింగ్ ఇచ్చింది రాణి.

ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ ఆమె ముందు నా ప్రేమని వ్యక్తపరిచే ప్రయత్నం చెయ్యలేదు. మరుసటి సంవత్సరంలోనే వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆ వూరు నుంచి వెళ్ళిపోయారు రాణీవాళ్ళు.

తర్వాత కొన్నాళ్ళవరకూ వాళ్ళ కుటుంబానికి, మా కుటుంబానికి మధ్య ఉత్తరాలు నడిచాయి. క్రమేపీ అవి కూడా తగ్గిపోయాయి. చివరికి వాళ్ళెక్కడ వున్నారో కూడా మాకు తెలీని పరిస్థితి వచ్చింది.

ఇన్ని సంవత్సరాల తర్వాత రాణిని ఇవాళ చూసాను. కానీ ఆ ఆనందం నాలో ఎక్కడా లేదు. ఆమె ఈ పరిస్థితికి ఎలా దిగజారింది? ఇదే నా బాధ.

"ఏరా! ఇంకా ఆ కిటికీ దగ్గరే కూలబడున్నావ్!...లే...లే...త్వరగా స్నానం చేసిరా." శేఖరం పలకరింపుతో ఆలోచనల్లోంచి బయటపడ్డాను.

"ఇవాళ అర్జంటు పనుంది. ఆఫీసుకి వెళ్ళకతప్పదు. రేపటినుంచీ నువ్వు తిరిగి వెళ్ళిపోయేవరకూ శలవు పెడతాను. ఈరోజు మాత్రం



బోరయినా భరించు...అన్నట్టు బోరెందుకు, భోంచేసి నేనటు ఆఫీసుకి వెళ్ళగానే, నువ్విటు తిరిగివచ్చి మీ స్వప్నసుందరితో కాలక్షేపం చెయ్యొచ్చు. సరేనా..." నవ్వాడు వాడు.

చిరాకేసింది నాకు. నా మనసు వాడికి అర్థంకాదు. వాడితో చెప్పుకోవడం గూడా అనవసరం. వాడి వాక్ప్రవాహానికి అడ్డం వెయ్యడం ఎలాగో తెలీక స్నానానికి బయలుదేరాను.

స్నానం చేస్తున్నంతసేపూ కూడా రాణి ఆలోచనలు నను విడిచి పెట్టలేదు.

ఎన్నోసార్లు "తప్పుకదూ!" అంటూ నాలో వివేకాన్ని తట్టి లేపడానికి ప్రయత్నించిన ఆమె ఇలాంటి పెద్ద 'తప్పు'లోకి ఎలా దిగజారింది?

ఇది నా బుర్రని బద్దలు కొడుతున్న ప్రశ్న.

దీనికి జవాబు చెప్పగల వ్యక్తి రాణి ఒక్కర్తె! అందుకనే శేఖరం ఆఫీసుకి వెళ్ళగానే ఆమెని కలవాలని నిర్ణయించుకున్నాను.

హోటల్లో భోంచేసిన తర్వాత శేఖరం ఆఫీసుకి వెళ్ళాడు. నేను వెనక్కి తిరిగాను.

ఇల్లు సమీపిస్తున్నకొద్దీ గుండెలు గట్టిగా కొట్టుకోసాగాయి. చెప్పలేని ఆందోళన.

ఇంతకు ముందు ఎన్నోసార్లు 'తప్పుకదూ' అంటూ నన్ను మందలించిన రాణిని ఇప్పుడు నేను 'తప్పుకదూ' అంటూ మందలించబోతున్నాను. కొద్దిగా గర్వంగా అనిపించింది. గుండె దడ కొద్దిగా తగ్గింది.

రాణి ఇంటి గుమ్మం మెట్లెక్కాను.

తలుపులు వేసున్నాయి.

నెట్టాను.

గడియవేసి వుండడంతో తలుపులు తెరచుకోలేదు.

తలుపుల మీద శబ్దం చేశాను.

"వస్తున్నా..." లోపల నుంచి వినిపించింది.

ఆ గొంతుని వెంటనే గుర్తు పట్టాను.

మనిషిలో ఎంత మార్పొచ్చినా రాణి గొంతులో మాత్రం ఎటువంటి మార్పూ రాలేదు.

కొన్ని క్షణాల్లో ఆమెని సందర్శించబోతున్నాను. తప్పదు!

తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా రాణి!

గడప అవతల ఆమె, ఇవతల నేను!

ఒక్క క్షణం నిశ్శబ్దం...బ్రహ్మాండం బ్రద్దలయ్యే నిశ్శబ్దం!

ముందామే తేరుకుంది.

"తప్పుకదూ? ఇట్లాంటి ఇళ్ళ వేపు నువ్వు రావచ్చా? వెళ్ళు ... మళ్ళీ ఎప్పుడూ రాకు..." ఛళ్ళున నా మొహం మీదే తలుపులు వేసేసింది.

నా కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది. అక్కడ నిలబడలేక గబగబా రూమ్ వేపు బయల్దేరాను. *

(విజయ మాసపత్రిక-ఏప్రిల్ 1985)